క్లుప్తంగా

పునరావాస కేంద్రం పరిశీలన



పునరావాస కేంద్రంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణనాయక్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోటలోని మున్సిపల్ కల్యాణ మండపంలో వరద సహాయక పునరావాస కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ పరిశీలించారు. పునరావాస కేంద్రంలో భోజన, వైద్య సదుపాయాల గురించి మత్స్యకారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ సరైన సమయానికి భోజనం, వైద్య సేవలను అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తొలగించిన వికలాంగుల పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదలు, శ్రామికులు, అణగారిన వర్గాల అభివృద్ధికి పని చేస్తామని నమ్మబలుకుతూ ఆచరణలో సంపన్నుల ప్రయోజనాలకు పాటుపడుతుందన్నారు. వికలాంగుల పింఛన్లలో కోత విధించడం క్రూరమైన చర్య అని, దానిని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లు పోరాటాల, ఉద్యమాల కృషితో సంపాదించుకున్న కనీస హక్కులన్నారు. పెన్షన్లను తగ్గించడం ద్వారా వికలాంగుల్లో అత్యధికమైన అణగారిన వర్గాలపై, నేరుగా దాడి చేస్తోందన్నారు. వారిని ఇంకా అధిక పేదరికంలోకి నెట్టడం, చిన్నచూపు చూపడమేనన్నారు.

ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా సౌభాగ్యలక్ష్మి

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సూర్యలక్ష్మి బదిలీ కావడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

యూరియా అక్రమ నిల్వలపై తెలపండి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): యూరియా అక్రమ నిల్వలు ఎక్కడైనా ఉంటే తెలపాలని విజిలెన్స్ ఎస్పీ స్నేహిత శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా అక్రమ నిల్వలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు దాడులు చేస్తున్నామన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గోదాములు, హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ షాపులపై విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేస్తాయన్నారు.

యూరియా అందక కష్టాలు

కోరుకొండ: అన్నదాతలకు సకాలంలో యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి జిల్లా మాజీ సభ్యుడు కంటే వినయ్‌తేజ దుయ్యబట్టారు. బూరుగుపూడిలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గంలో 16,150 హెక్టార్ల సాగు భూమికి325 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. కోరుకొండ మండలానికి 80 మెట్రిక్ టన్నులు కావాల్సి ఉండగా, కేవలం 35 మెట్రిక్ టన్నులు అందించారన్నారు. యూరియా రైతన్నలకు సకాలంలో అందక ఇబ్బంది పడుతున్నారన్నారు. దివ్యాంగుల పింఛన్లను తొలగించడం సరికాదని వినయ్‌తేజ అన్నారు. బూరుగుపూడికి చెందిన ఇంజే ప్రేమ్ కుమార్‌కు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దివ్యాంగ పింఛను అందించేవారన్నారు. ఇప్పుడు తొలగించడం దారుణమన్నారు.

సినిమాలు



శ్యామల	: పరదా
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలెస్	: పరదా
స్వామి	: కూలీ
అనుశ్రీ	: కూలీ
శివజ్యోతి	: బన్ బటర్ జామ్
రాజా	: వార్–2
ఊర్వశి	: కూలీ
మేనక	: యూనివర్శిటీ
రంభ	: స్టాలిన్
అప్సర	: వార్–2
అశోక	: వార్–2
నామవరం:	
వీఎస్.మహల్	: కూలీ
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ	: కూలీ, మహావతార్ నరసింహ
కడియం:	
వెంకటసూర్య	: కూలీ

ముంగిట్లో సమకూరగా..

- నగరంలో కర్రీ పాయింట్లకు ఆదరణ
- క్యూ కడుతున్న ఉద్యోగులు, విద్యార్థులు



కర్రీ పాయింట్‌లో కూరలు



కర్రీ పాయింట్ వద్ద ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ప్రకాశంనగర్: కాలం మారింది.. జీవన వేగం పెరిగింది.. ప్రతి ఒక్కరిదీ బిజీ లైఫ్ అయ్యింది.. తినే ఆహారం విషయంలోనూ అదే వచ్చింది.. కూరలు వండే పని లేకుండా వీధికో కర్రీ పాయింట్ రావడంతో వాటికి ప్రాధాన్యం పెరిగింది.. కూరగాయలు తెచ్చే పనిలేకుండా, వంట గదికి వెళ్లకుండానే బయట నుంచి కూరలు తెచ్చేకునేందుకు అంతా ఆసక్తి చూపుతున్నారు. రాజమహేంద్రవరం నగరంలో కర్రీ పాయింట్‌ల కల్చర్ పెరిగింది. జనం ఎగబడటంతో రోజుకు మూడు పచ్చళ్లు.. ఆరు కూరలుగా ఈ వ్యాపారం సాగుతోంది. స్థానిక నందం గన్నిరాజు జంక్షన్, దానవాయిపేట, ప్రకాశంనగర్ రౌండ్ పార్కు, జాంపేట, శ్యామలా సెంటర్, ప్రధాన రైల్వే స్టేషన్, క్వారీ ప్రాంతం ఇలా ఎక్కడ చూసినా కర్రీ పాయింట్లు జనంతో కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో రద్దీగా ఉంటున్నాయి. నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ఇతర పనులపై వచ్చేవారికి అన్నం, వివిధ రకాల కూరలు, సాంబారు, పెరుగు, పచ్చడి వంటి అన్ని ఆహార పదార్థాలు కర్రి పాయింట్‌ల వద్ద విక్రయిస్తున్నారు. వీటితో పాటు నాన్‌వెజ్ రుచులైన చికెన్ కర్రి, చేపల పులుసు, ప్రాన్స్ వేపుడు వంటివి అందుబాటులో ఉంచుతున్నాయి. నగరంలో సుమారు 1,500 పైగా రెస్టారెంట్లు, చిన్న, పెద్ద హోటళ్లు ఉన్నాయి. కాగా ఆదివారం, సెలవు రోజులు, పండగలు వంటి ప్రత్యేక రోజుల్లో తప్ప మిగిలిన రోజుల్లో ఆశించిన స్థాయిలో హోటల్ వ్యాపారాలు ఉండడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే కర్రి పాయింట్‌ల వ్యాపారం బాగుందని అంటున్నారు. మరి కొన్నిచోట్ల ఇంటి భోజనం పేరుతో కొందరు మహిళలు హోమ్ మెస్‌లు ఏర్పాటు చేసి అన్నం, పప్పు, కర్రి వంటి వాటిని విక్రయించడంతో విద్యార్థులు, చిరు ఉద్యోగులు నెలవారీ కార్డులను తీసుకుంటున్నారు.

వంటిల్లు... పనులకు చెల్లు

నగర వాసుల్లో అత్యధిక శాతం భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులు ఉంటున్నారు. ఉదయమే వారు ఉద్యోగులు, వ్యాపారాలకు వెళ్లిపోవడంతో మధ్యాహ్నం భోజన సమయానికి ఆయా ప్రాంతాల్లోని కర్రి పాయింట్లే వారికి ఆసరాగా నిలుస్తున్నాయి. వీటితో పాటు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌లు అందుబాటులోకి రావడంతో కేవలం నిమిషాల వ్యవధిలోనే వారు కోరుకున్న ఆహారం ముంగిటకే తీసుకు వస్తున్నారు. ఇలా మహిళలు వంట తంట నుంచి విముక్తి పొందుతున్నారు. కర్రి పాయింట్లలో వివిధ రకాల కర్రీలు అందుబాటులో ఉండడంతో పాటు ధరలు తక్కువ ఉండటం, నాణ్యత బాగానే ఉండడంతో ఆసక్తి చూపుతున్నారు.

ఉపాధికి ఊతం

కర్రి పాయింట్ వ్యాపారం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మంది ఉపాధికి ఊతంగా మారింది. ముఖ్యంగా జాంపేట, నందం గనిరాజు జంక్షన్ వంటి ప్రాంతాల్లో కర్రి పాయింట్‌ల నిర్వాహకులు మహిళలే కావడం విశేషం. ఈ ప్రాంతాల్లో పోటీ పరీక్షలకు సంబంధించిన పలు కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. ఇక్కడ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నారు. ఈ ప్రాంతాల్లో కర్రి పాయింట్‌లు అధికంగా ఉండడంతో బియ్యం, కిరాణా, కూరగాయలు, ఆకు కూరలు వంటి వ్యాపారాలు సైతం క్రమంగా పుంజుకొంటున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. కర్రి పాయింట్‌ల జోరుకు నగరంలోని పలు సెంటర్లలో ఉన్న హోటళ్ల వ్యాపారాలు సైతం తగ్గుముఖం పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

> **కర్రీ పాయింట్ల వ్యాపారం బాగుంది**
>
> గతంతో పోలిస్తే ఇప్పుడు హోటళ్లకు వచ్చేవారి సంఖ్య తగ్గింది. హోటల్‌కు వచ్చి తినే వారితో పోలిస్తే ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ, టేక్ ఆన్ డెలివరీల సంఖ్య పెరిగింది. వీటితో పాటు రోడ్డుపై కర్రి పాయింట్‌లు, ఫుడ్ స్టాల్స్ వద్ద విక్రయాలు పెరిగాయి. జనం ఇక్కడ ఎగబడుతున్నారు.
>
> – ఆర్.ఫణీంద్ర, హోటల్ నిర్వాహకుడు

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ శుక్రవారం ప్రకటించారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. మెయిన్ రోడ్డు, ఉల్లితోట వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతివారి వీధి, గోదావరి బండ్ తదితర ప్రాంతాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

త్రీమెన్ కమిటీల ప్రమాణ స్వీకారం

కడియం: మండలంలోని వేమగిరి, కడియం, కడియపులంక, మురమండ సహకార సొసైటీల త్రీమెన్ కమిటీల ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ఆ కమిటీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. వేమగిరి పీఏసీఎస్ చైర్మన్‌గా వెలుగుబంటి వెంకటాచలం, సభ్యులుగా పితాని శివరామకృష్ణ, పుల్లైపు వెంకట రమణమూర్తి, కడియం సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా వెలుగుబంటి రఘురామ్ (నాని), సభ్యులుగా తుమ్మెద వరహాల రాజులచే ప్రమాణ స్వీకారం చేయించారు. మురమండ చైర్మన్‌గా వట్టికూటి దత్తుడు, సభ్యులుగా తూము శ్రీను, కడియపులంక పీఏసీఎస్ అధ్యక్షుడిగా గట్టి నరసయ్య, సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. కడియపులంకలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు.

జానపద సాహితీ బ్రహ్మ 'నేదునూరి'



నేదునూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: జానపద సాహితీ బ్రహ్మ నేదునూరి గంగాధరం అని వక్తలు కొనియాడారు. శుక్రవారం తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి ఆధ్వర్యంలో తెలుగు మాటల పండగను పురస్కరించుకుని రెండో రోజు స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద నేదునూరి గంగాధరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానపద పరిశీలకులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ నిద్రమైన జానపద సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి అనేకమంది భావి పరిశోధకులకు నేదునూరి దిక్సూచి అయ్యారన్నారు. మరో అతిథి జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో పూర్వకాలంలో ప్రజలు జానపద పాటలు ఆలపించడం ద్వారా శారీరక, మానసిక అలసటను మరిచిపోయే వారన్నారు. జానపదాలే కాకుండా జ్యోతిషం, వాస్తు శాస్త్రం, ఆయుర్వేదం తదితర అంశాలపైనా నేదునూరి గంగాధరం చేసిన కృషి నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సప్పా దుర్గాప్రసాద్, చెర్ల సీతారామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నగర పురోభివృద్ధికి సమగ్ర ప్రణాళిక



ప్లాన్‌ను పరిశీలిస్తున్న సురేష్‌కుమార్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగర పురోభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ సూచించారు. శుక్రవారం నగరంలో పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ పి.ప్రశాంతితో కలసి పరిశీలించారు. నారాయణపురంలోని ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. భవనంలోని మౌలిక సదుపాయాలతో పాటు క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, స్నూకర్ బిలియర్డ్స్, షూటింగ్, జిమ్ పరికరాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని పురస్కరించుకుని యోగా పార్కు పేరిట నగరంలో థీమ్ బేస్డ్ పార్కు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. స్థానిక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు ఈ పార్కులను అప్పగించడం ద్వారా నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. అలాగే పార్కులలో సేంద్రియ వ్యర్థాల నిర్వహణకు, భూసారవంతాన్ని పెంచడానికి వర్మీ కంపోస్ట్ యూనిట్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం జేఎన్ రోడ్డులోని స్టోమ్ వాటర్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. నగరంలో ఇప్పటివరకు 23 కిలోమీటర్ల మేర స్టోమ్ వాటర్ డ్రెయిన్ లైన్లు ఉండగా, వాటికి అదనంగా మరో 10 కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన అవసరం ఉందని అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకువచ్చారు. ఆ మేరకు సమగ్రమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) రూపొందించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సూచించారు. హుకుంపేటలో 50.6 ఎంఎల్‌డీ సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణాన్ని చూశారు. డిసెంబర్ లోపు ఈ ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. నగరంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో ముఖ్యమైన కూడళ్లు, ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించడానికి ప్రత్యేకమైన డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలంతా వ్యర్థ పదార్థాలను కాలువల్లో వేయకుండా చూడాలన్నారు.

పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వండి

అనంతరం రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులను పరిశీలించిన ఆయన నగరంలో పచ్చదనానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. స్లాటర్ హౌస్ (కబేళా), గోకవరం బస్టాండ్ వద్ద మహిళా మార్ట్‌ను ఆయన పరిశీలించారు. మహిళా మార్ట్ ద్వారా అమ్మకాలు చేసే వస్తువులను డోర్ డెలివరీ సదుపాయం కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈలు ఎంసీహెచ్ కోటేశ్వరరావు, జి.పాండురంగారావు, ఈఈలు మాధవి, రీటా, మదర్సా అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించాలి



ప్లాస్టిక్ నిషేధంపై ఆరా తీస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి

కడియం: ప్లాస్టిక్ నిషేధంపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి ఆదేశించారు. శుక్రవారం ఆమె డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్‌తో కలసి కడియం మండలం దుళ్ల గ్రామాన్ని పరిశీలించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న స్వమిత్వ సర్వే తీరుపై ఆరా తీశారు. నత్తనడకన సర్వే జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. అవసరమైతే మరిన్ని టీమ్‌లను పెంచుకుని, సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన డీపీఓ ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అసలు దుకాణాలకు పంచాయతీ అధికారులు నోటీసులు అందించారా అని షాప్ యజమానులను అడిగారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని వదిలి వేయాలని, ఆరోగ్యకరమైన సమాజం కోసం సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సత్యానంద కుమార్, శివయ్య, సర్వే టీమ్ చందన, కల్యాణి పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

కడియం: మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని కడియపులంక పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్స్ పంపిణీ చేశారు. చిరుసేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జనసేన సిటీ అధ్యక్షుడు వై. శ్రీనివాస్, సర్పంచ్ మారిశెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిలక్‌కుమార్ తదితరులు

సీటీఆర్ఐ: సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా మెరుగైన సమాజం ఏర్పాటు అయ్యేలా చూడాలని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.తిలక్ కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గార్డ్స్ ఫర్ ఆర్‌టీఐ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్‌టీఐ 20 వసంతాల వేడుక జరిగింది. ఈ సందర్భంగా తిలక్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆర్టికల్ 19 ప్రకారం భావప్రకటన స్వేచ్ఛ ప్రాకారంలో సమాజంలో జరిగే రుగ్మతను ప్రశ్నించాలని అన్నారు. ఉన్న స్వేచ్ఛను ఉపయోగించుకొని మంచి సమాజం కోసం విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గార్డ్స్ జాతీయ కన్వీనర్ నాగేశ్వరరావు, గుత్తుల మురళీధరరావు, కాలేజీ ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం, గార్డ్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదేశాలు బేఖాతర్..



వైటీసీ ప్రాంగణం వెనుక చిట్టడవిని తలపిస్తూ..



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం పక్కన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ఫ్లెక్సీపై నీరు నిల్వతో పెరిగిన దోమలు

వైటీసీ ప్రాంగణం వెనుక తొలగని చెత్త



వైటీసీ ప్రాంగణం మేడపై గుట్టగా మంచినీటి సీసాలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైటీసీ ప్రాంగణంలోని జిల్లా కార్యాలయాల వెనుక పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిందని 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 5న 'ప్రాంగణం.. చెత్తమయం' శీర్షికన కథనం వచ్చింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ 6న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వైటీసీ ప్రాంగణంలో జిల్లా కార్యాలయాలున్న అధికారులకు శుభ్రం చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా ఇప్పటివరకూ అది ఆచరణకు నోచుకోలేదు. తిరిగి శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పరిశుభ్రత, పరిశుభ్రతతో పాటు వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుకోవాలని శుక్రవారం అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించే జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంతో పాటు, డ్వామా, డీఆర్‌డీఏ, జిల్లా అగ్నిమాపక, పరిశ్రమల శాఖ, ఏపీఎంఐడీసీ, సమాచార శాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ తదితర కార్యాలయాలు ఈ ప్రాంగణంలోనే ఉన్నాయి. కార్యాలయాల వెనుక పిచ్చి మొక్కలు భారీ వృక్షాలుగా మారిపోవడంతో పాటు, తాగేసిన మంచినీటి బాటిల్స్‌ను పోగుగా పెట్టడం, కార్యాలయాల వెనుకే చెత్త పోయడం ఇలా అనేకం వైటీసీ ప్రాంగణంలో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రం చేస్తారో లేదో వేచిచూడాల్సిందే.

స్వార్థం కోసమే రోడ్లు ధ్వంసం

- కూటమి నేతలదే తప్పిదం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అనపర్తి– కొమరిపాలెం రోడ్డును కూటమి నేతలు ధ్వంసం చేశారని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. భారీ టిప్పర్ లారీల కారణంగా ధ్వంసమైన రోడ్డును శుక్రవారం ఆయన కొప్పవరం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలసి పరిశీలించారు. అనంతరం డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కొమరిపాలెం, అనపర్తి, కొప్పవరం తదితర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ రోడ్డు అభివృద్ధి గురించి దశాబ్దాలుగా ఎదురు చూశారన్నారు. టీడీపీ పాలనలో ప్రజలు పాదయాత్రలు, ఆందోళనలు చేసినా ఆనాటి, ప్రస్తుత ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక రూ.3 కోట్లు మంజూరు చేయించి రోడ్డు వేయించామని అన్నారు. ఈ రోడ్డు అనపర్తి మండల వాసులకే కాకుండా బిక్కవోలు, పెదపూడి మండలాల గ్రామాల నుంచి నియోజకవర్గ కేంద్రమైన అనపర్తికి రావడానికి ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. అయితే ఇటీవల ఎమ్మెల్యే అనుచరులు కొప్పవరం గ్రామంలో ప్రైవేట్ లేఅవుట్ వేయడం, దానిని మెరక చేయడానికి భారీ వాహనాలు విచ్చలవిడిగా తిరగడంతో రోడ్డు అనేక చోట్ల కుంగిపోయి పాడైపోయిందని అన్నారు. ఒకటి, రెండు రోజులు వర్షం వస్తే రోడ్డు మొత్తం పాడైపోయే పరిస్థితి ఉందని, భారీ వాహనాలు తిరిగేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. కానీ వారి స్వలాభం కోసం మూడు మండలాల ప్రజలకు ఇబ్బంది కలిగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కొన్ని రోడ్లకు మసిపూసి మారేడు కాయ చేసిన ఎమ్మెల్యే రోడ్లకు 'మహర్దశ' అంటూ ఫ్లెక్సీలు పెట్టించుకున్నారని, చిన్నపాటి వర్షానికి ఆ ప్యాచ్ వర్క్‌లు బయట పడుతున్నాయన్నారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ఈ రోడ్డును బాగు చేయించాలని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పాలమూరు ఉప సర్పంచ్ సత్తి సూరారెడ్డి, మాజీ సర్పంచ్ తాడి సూరారెడ్డి, ఉప సర్పంచ్ మల్లిడి వీర్రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ కర్రి సత్తిరెడ్డి, తాడి సోమిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి, వార్డు సభ్యులు సత్తి శ్రీనివాస్ రెడ్డి, మల్లిడి సతీష్‌రెడ్డి, మేడిశెట్టి సన్యాసిరావు, నాయకులు మల్లిడి సోమిరెడ్డి, గోగు వీరవెంకట సత్యనారాయణ, పెంకె నాగరాజు, మల్లిడి ఈశ్వరరామారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, కొల్లపర్తి సత్యనారాయణ, తాడి రామ్మూర్తి, కర్రి పెద్దకాపు పాల్గొన్నారు.